ప్రజాశక్తి
బుధవారం 23 అక్టోబరు 2024
5
శ్రీకాకుళం

25న మినీ జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటిఐ విద్యార్హత కలిగిన 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఈనెల 25న మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని బలగలో గల ప్రభుత్వ డిఎల్‌టిసి, ఐటిఐ కళాశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో మోడలైజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్.ఎస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కొల్గేట్ పామోలివ్, అపోలో టైర్స్ సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత వారి విద్యార్హత పత్రాల నకలు, ఆధార్ కార్డు, మూడు బయోడేటా పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7095731303, 8317652552 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'దానా'పై అప్రమత్తం

- రేపట్నుంచి జిల్లాలో భారీ వర్షాలు
- అధికారులకు సెలవులు రద్దు
- మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపానుపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. తుపాను తీవ్రత నేపథ్యంలో ఈనెల 24 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సముద్ర, నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి క్షేత్రస్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని నదులు, వాగుల్లో ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాజ్ వే, వంతెనలపై నీరు ప్రవహించే చోట్ల పాదచారులు, వాహన చోదకులను నియంత్రించాలని సూచించారు. తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులు రాత్రి నుంచే చేపల వేటకు వెళ్లకుండా నిరోధించాలన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08942-240557 ఫోన్ నంబరుతో ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలన్నారు. గండ్లు పడే అవకాశమున్న చెరువులు, కరకట్టలు, కాలువలపై ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు.

అవసరమయ్యే ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. లైఫ్ బోట్లు, కూలిన చెట్లను తొలగించే యంత్రాలు, విద్యుత్ స్తంభాలు, తుపాను రక్షిత భవనాలను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులకు సెలవులను రద్దు చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బాహుదా నదుల్లో నదీ ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని, ఎక్కడా ప్రాణ నష్టం సంభవించకూడదని స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారుల నియామకం

తుపాను ముందస్తు చర్యలలో భాగంగా జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షక అధికారులను నియమించారు. వీరంతా ఆయా తీర ప్రాంత మండలాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు. రణస్థలానికి డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ (8008803800), ఎచ్చెర్లకు డ్వామా పీడీ బి.సుధాకరరావు (8790008399), శ్రీకాకుళం జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య (8341493877), గారకు ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ (9440814582), పోలాకికి జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా (9100997770), సంతబొమ్మాళికి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు (9866530885), వజ్రపుకొత్తూరుకు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి శ్రీనివాసరావు (9440716028), సోంపేటకు కార్మిక శాఖ సహాయ కమిషనర్ అజయ్ కార్తికేయ (9492555034), మందసకు పశు సంవర్ధకశాఖ పలాస సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ (9492416700), కవిటికి ఉద్యానశాఖ అధికారి ఆర్.వి ప్రసాద్ (7995086758), ఇచ్ఛాపురానికి డ్వామా ఎపిడి సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి (6309998070)ని నియమించారు.

డిగ్రీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

డిగ్రీలో ప్రత్యేక ఫీజులు రద్దు చేయాలి

- విద్యా, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్

ప్రజాశక్తి - టెక్కలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అమలు చేస్తున్న ప్రత్యేక ఫీజులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెన నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఇవే డిమాండ్లపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 47 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు గత ప్రభుత్వం విద్యా, వసతి దీవెన నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారంలోకి వస్తే విద్యా, వసతి దీవెన నిధులను ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా విద్యార్థుల ఖాతాల్లోకి జమ చేస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఆ హామీ ఊసెత్తడం లేదని విమర్శించారు. విద్యారంగం, విద్యార్థుల అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెన నిధులను విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు భారంగా మారిన ప్రత్యేక ఫీజులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పడితే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారని, అప్పటివరకు కళాశాల యాజమాన్యాలు ఎటువంటి ఒత్తిడి చేయకూడదన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకుంటే రిలే నిరాహార దీక్షలు చేపడతామని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, యు.దుర్గాప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, నాయకులు పవిత్ర, నగేష్, దివ్య, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

విద్యుత్ భారాలు వేయొద్దు

- సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో సిపిఎం నాయకులు ఎం.గౌరీశంకర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పలురూపాల్లో మోపిన విద్యుత్, ఇతర భారాలను తగ్గిస్తామని, ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీకి భిన్నంగా విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీలు 2022-23 సంవత్సరానికి సుమారు రూ.8,114 కోట్ల భారం మోపుతూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మరో రూ.11 వేల కోట్లకు పైగా సర్దుబాటు ఛార్జీల భారం మోపబోతున్నారని వార్తలు వస్తున్నాయన్నారు. సుమారు రూ.20 వేల కోట్ల భారం రాష్ట్ర ప్రజలపై పడబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యుత్ కంపెనీల దోపిడీ, అధిక రేట్లకు పవర్ ఎక్స్ఛేంజ్‌లో స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు, పలు స్థాయిల్లో అవినీతి, అపసవ్య విధానాలతో విద్యుత్ వ్యయం పెరుగుతోందని తెలిపారు. ఆ భారాన్ని సర్దుబాటు ఛార్జీల రూపంలో జనం నెత్తిన వేయడం అసమంజసమన్నారు. నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఆకాశాన్ని తాకుతున్న దశలో ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, అదనపు భారాలు మోపడం సరికాదన్నారు. ఏనాడో వాడుకున్న విద్యుత్‌కు తర్వాత కాలంలో సర్దుబాటు ఛార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్.వి రమణ, పి.దుర్గాప్రసాద్, ఎం.సూర్యనారాయణ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ మొదలైనందున రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఈనెల 31వ తేదీ నాటికి ఓటరు జాబితాను తయారు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి ఎంపిడిఒలు, తహశీల్దార్లు, పంచాయతీరాజ్, ఉపాధి హామీ ఎపిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల అంశంలో కిందిస్థాయి సిబ్బందికి ఆర్‌డిఒలు శిక్షణ ఇవ్వాలని సూచించారు. హౌసింగ్‌లో స్టేజ్ కన్వర్షన్లపై దృష్టిసారించాలని, పూర్తయ్యే దశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని, 70 వేల పనిదినాల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాలని చెప్పారు. నరేగా పనుల్లో ప్లాంటేషన్ ఫిట్టింగ్, ఫామ్ పాండ్స్ పూర్తి చేసేందుకు మట్టి పనుల్లో లేబర్ కాంపొండ్ పెరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీల్లో ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. ఆయిల్‌ఫామ్ చెట్లను పెంచేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ మరమ్మతులు, స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్ అనుగుణంగా పనులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల మరమత్తు పనులు పూర్తిచేసి వినియోగంలో తీసుకురావాలన్నారు. ఎరువును రిటైల్‌గా అమ్మేందుకు ప్రయత్నించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి, నీటిపారుదల శాఖ ఎస్ఇ పి.సుధాకర్, సిపిఒ ప్రసన్నలక్ష్మి పలువురు అధికారులు పాల్గొన్నారు.

మీకు పనిచేయడం చేతకాదా..?

- ప్రత్యామ్నాయ మార్గాలను ఎందుకు అలోచించరు?
- ఆర్అండ్‌బి అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రానప్పుడు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించరా?, మీకు పనిచేయడం చేతకాదా అని మండిపడ్డారు. రోడ్లు, భవనాలశాఖకు సంబంధించిన పనులపై ఆ శాఖ అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల ప్రగతిని తెలుసుకుంటున్న సందర్భంలో విద్యుద్దీకరణ కోసం ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి డబ్బులు చెల్లించాలని అడుగుతున్నారని ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికారి ఒకరు చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భవన నిర్మాణానికి డబ్బులు చెల్లించాలని అడగడమేమిటని, వెంటనే ఫోన్ కలపాలంటూ ఇపిడిసిఎల్ ఇంజినీర్‌కు సూచించారు.

ఇంటిగ్రేటెడ్ నూతన కలెక్టరేట్ నిర్మాణం పనులపై ఆర్ అండ్ బి ఎస్ఇ జాన్ సుధాకర్ కలెక్టర్‌కు వివరించారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లో ప్రస్తుతం చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేసిన పనులను కాంట్రాక్టర్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశ మందిరం, కలెక్టర్ పేషీలకు సంబంధించి పలు సూచనలు చేశారు. కోడి రామ్మూర్తి క్రీడా మైదానానికి సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. గార మండలం వనిత మండలం - పోలాకి కనెక్టివిటీ హై లెవల్ క్రాసింగ్ బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వంతెన నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, డబ్బుల చెల్లింపులపై ఆర్ అండ్ బి ఉన్నతాధికారితో మాట్లాడారు. కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారికి ఇరువైపులా సుందరీకరణ పనులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విజయాదిత్య పార్క్ పనులకు సంబంధించి పార్కింగ్, మరుగుదొడ్ల, సైకిల్ ట్రాకింగ్, ఫుట్‌పాత్, గ్రీనరీల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్లు వివరించారు. పెద్దపాడు చెరువును పార్కుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన డిపిఆర్‌ను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, ఆర్అండ్‌బి ఇఇ, డిఇలు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

27న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఈనెల 27న నగరంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి చెకుముకి సైన్సు సంబరాలను నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జెవివి జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 30 మండలాల్లోని 410 పాఠశాలల నుంచి 22 వేల మంది విద్యార్థులు పలుస్థాయిల్లో నిర్వహించిన చెకుముకి సైన్సు సంబరాల్లో పాల్గొన్నారని తెలిపారు. మండల స్థాయిలో విజేతలైన 75 బృందాల్లోని 225 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సైన్సు ఉద్యమకారులు జిల్లాస్థాయి సంబరాలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య, అతిథులుగా ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, ఉప విద్యాశాఖాధికారులు ఆర్.విజయ కుమారి, పి.విలియం, జెఎసి సెక్రెటరీ జనరల్ చౌదరి పురుషోత్తం నాయుడు, ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం తదితరులు హాజరు కానున్నట్లు వివరించారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఐజి గోపీనాథ్ జట్టి

డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - నరసన్నపేట, పోలాకి

జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలాకి, నరసన్నపేట పోలీస్‌స్టేషన్లు, నరసన్నపేట సర్కిల్ కార్యాలయాన్ని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. డిఐజికి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్‌లో పచ్చదనానికి ప్రతీకగా మొక్కలు నాటారు. ఆయా పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు అప్రమతంగా ఉండాలన్నారు. ఈ నేరాలకు ప్రత్యేకించి మధ్య వయస్కులు, వృద్ధులు బలవుతున్నారని చెప్పారు. సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సైబర్ మోసగాళ్లు అనుసరించే ఎత్తుగడలను వివరించారు. ఫోన్‌కు వచ్చే ఒటిపిలు, పాస్‌వర్డులు ఎవరితోనూ పంచుకోరాదన్నారు. సైబర్ మోసగాళ్లు పలురకాలుగా నమ్మించి మోసం చేసేందుకు ప్రయత్నిస్తుంటారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని సూచించారు. సైబర్ మోసం జరిగిన కొద్దిగంటల్లో ఆ నంబరుకు ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందన్నారు. నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ (1800-11-4000) సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ cybercrime.gov.inలో నమోదు చేయాలని సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తక్షణమే సంప్రదించి సైబర్ మోసం వివరాలు చెప్పాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐలు రంజిత్ కుమార్, అనిల్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తయ్యే దశలో పనులు పున: ప్రారంభమా?

- పోర్టు కాంట్రాక్టర్లు, ఏజెన్సీలను బ్లాక్‌మెయిల్ చేసే ఎత్తుగడ
- వైసిపి టెక్కలి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మూలపేట పోర్టు పనులు 70 శాతం పూర్తయిన దశలో పనులు పున:ప్రారంభించడం ఏమిటో మంత్రి అచ్చెన్నాయుడు చెప్పాలని వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని ఎం.సున్నాపల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మూలపేట పోర్టుతో ఈ ప్రాంతం, జిల్లా అభివృద్ధి చెందుతుందని, దశాబ్దాల కలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెరవేర్చారని చెప్పారు. శరవేగంగా సాగుతున్న పోర్టు నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం వచ్చాక నిలుపుదల చేసిందన్నారు. పోర్టు యాజమాన్యాన్ని, కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసి దోచుకునే ఉద్దేశంతో పనుల పున:ప్రారంభం అని ఆరోపించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో భూసేకరణ చేపట్టకుండా, అనుమతుల్లేకుండా తామే పోర్టును తెచ్చామని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకవేళ తెస్తే 2019 వరకు ఏం చేశారని ప్రశ్నించారు. మూలపేట పోర్టు నిర్మాణానికి అన్ని అనుమతులు తెచ్చింది జగన్మోహన్ రెడ్డి అని, పోర్టు పనులను అడ్డుకోకపోతే ఈపాటికి మొదటి షిప్ వచ్చేదన్నారు. ఇది నిజం కాదని కలెక్టర్ గానీ, పోర్టు యాజమాన్య ప్రతినిధులు గానీ బహిరంగ ప్రకటన చేయగలరా అని సవాల్ విసిరారు. మద్యం టెండర్లు వేయకుండా వ్యాపారులు, తటస్థులు, వైసిపి అనుయాయులను బెదిరించి సిండికేట్‌గా మారి టిడిపి నాయకులు మద్యం షాపులు దక్కించుకున్నారని విమర్శించారు. మద్యం షాపులు ఎవరు దక్కించుకున్నారు, వారి వెనుక ఎవరు ఉన్నారో త్వరలోనే బహిర్గతం చేస్తానన్నారు. ఉచిత ఇసుక విధానం పేరిట ప్రజలను మోసగించారని ధ్వజమెత్తారు. వేలాది టన్నుల ఇసుకను విశాఖపట్నం, ఇతర ప్రాంతాలకు తరలించి రూ.కోట్లను అధికార పార్టీ నాయకులు దోచుకుంటున్నారని విమర్శించారు. ఇసుక, మద్యం విధానం వల్ల వచ్చిన ఆదాయంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వచ్చిన సొమ్ముతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.మోహన్ రెడ్డి, మార్పు నాగభూషణరావు, పి.శ్రీనివాస రెడ్డి, పంగ రామయ్య, నక్క రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తిలక్

కేసు కట్టడానికి 40 గంటలు ఎందుకు?

- అత్యాచార నిందితులకు టిడిపి నాయకులతో సంబంధాలు
- బాధితుల తల్లి ఫిర్యాదు చేయకుండా బెదిరింపులు
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

బాలికలపై అత్యాచార ఘటనలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 40 గంటల సమయం ఎందుకు పట్టిందని మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి మంగళవారం వెళ్లిన ఆయన అత్యాచార ఘటనపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అత్యాచార నిందితులకు టిడిపి నాయకులతో సంబంధాలు ఉన్నాయన్నారు. నిందితుల్లో ఒకరు తన తండ్రితో కలిసి ఎమ్మెల్యే శిరీషను కలవడంతో, వారి ఎదుటే ఎమ్మెల్యే బాధితుల తల్లితో మాట్లాడారని ఆరోపించారు. కావాలంటే సిసి ఫుటేజ్ పరిశీలించాలన్నారు. శనివారం రాత్రి ఘటన జరగ్గా, పలువురు టిడిపి నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి రాజీ చేస్తామని, ఫిర్యాదు చేస్తే మరోలా ఉంటుందని బెదిరించారని చెప్పారు. బాధితుల తల్లి ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, హుటాహుటిన స్టేషన్‌కు చేరుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని విలేకరుల ఎదుట మొసలికన్నీళ్లు కార్చారని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచార ఘటనపై తక్షణమే ఉన్నతస్థాయి కమిటీ వేసి ఎఫ్ఐఆర్ నమోదుకు 40 గంటలు ఎందుకు పట్టింది, బాధితుల తల్లిని ఎవరు బెదిరించారు, సెటిల్‌మెంట్‌లో ఎవరెవరి పాత్ర ఉందనే అంశాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుల ఇంటికి వెళ్లి వాళ్ల తల్లితో మాట్లాడి భరోసానిచ్చారు. ఆయన వెంట వైసిపి నాయకులు ఉన్నారు.

ఎస్ఐతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పెద్దమురహరిపురం, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, కిడిసింగి, చినవంక, బైపల్లి, అక్కుపల్లి, గరుడభద్ర, రాజాం గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు, గ్రామస్తుల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందించడానికి ప్రభుత్వం పెద్ద పునాది వేస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లో నీటి, రవాణా, వ్యవసాయ వంటి రంగాల్లో గణనీయమైన మెరుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు, మాజీ ఎంపిపి సూరాడ మోహనరావు, గొరకల వసంతరావు, దువ్వాడ హేంబాబు చౌదరి, పుచ్చ ఈశ్వరరావు, ఉమామహేష్ పాల్గొన్నారు.

పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడలతోనే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, పట్టుదల, అక్రమశిక్షణతో పథకాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ 34వ సీనియర్ ఇంటర్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా రాష్ట్రస్థాయి పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని అన్నారు. ఈ పోటీలో రాష్ట్ర నలుమూల నుంచి 15 జిల్లాల క్రీడా జట్లు హాజరై క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాయి. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి.స్వరూప్, ప్రధాన కార్యదర్శి జి.అర్జునరావురెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.వి.డి.మురళి, మానస శ్రీనివాస్, బి.శ్రీనివాస్‌రెడ్డి, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి జిల్లా క్రీడాకారులకు ఏకరూప క్రీడా దుస్తులను అందజేశారు. రాష్ట్ర పోటీల్లో జిల్లాను విజయపథంలో నిలపాలని ఆకాంక్షించారు. జిల్లా పురుషులు, మహిళల జట్లు సమిష్టిగా రాణించి జిల్లా కీర్తిని చాటాలని తెలిపారు.

మాస్టర్‌ప్లాన్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణ బృహత్తర ప్రణాళిక మాస్టర్ ప్లాన్‌పై కౌన్సెల్ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన నూతన టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్‌కు మంగళవారం వివరించారు. మాస్టర్ ప్లాన్ సంబంధించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు లీలారాణి, మధుమూర్తి, బచ్చు జగన్, ఆదిరెడ్డి, ప్లానింగ్ సెక్రటరీ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

పాతపట్నం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పాతపట్నం

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని ఎ.ఎస్.కవిటిలో రీ సర్వే జరిగిన భూ సమస్యల పరిష్కారంలో భాగంగా మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్‌లో జరిగిన మోసాలపై రైతులకు వివరించారు. ఈ రెవెన్యూ సదస్సులో పట్టాదారు పుస్తకాల్లో తప్పులు ఏమైనా ఉంటే సరి చేసుకోవాలని తెలిపారు. ప్రజల సమక్షంలోనే భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జి, శైలాడ సతీష్ పాల్గొన్నారు.

నరసన్నపేట : రెవెన్యూ సదస్సుతో సత్వరమే భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని యారబాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కవిటి: రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని తహశీల్దార్ మురళీమోహన్ సూచించారు. మండలంలోని భైరిపురంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సుమారు 80కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డిటి ఎం.కృష్ణమూర్తి, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ మల్లికార్జున్ పానిగ్రాహి, విఆర్ఒ ఢిల్లీరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ముచ్చింద్ర, కేశుపురం పంచాయతీల్లో తహశీల్దార్ వెంకటరావు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ మేరకు 43 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డిటి సంతోష్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

పలాస : ఇటీవల రీ సర్వేలో ఏమైనా సమస్యలుంటే తక్షణమే పరిష్కారం చేసేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మండలంలోని అమలకుడియాలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ ప్రతినిధి కొర్ల మురళీకృష్ణ చౌదరి, రీ సర్వే డిటి సునంద, మండల సర్వేయర్ గిరి, టిడిపి నాయకులు వరిశ తారకేశ్వరరావు, ఎ.జనార్ధనరావు పాల్గొన్నారు.

కంచిలి : గ్రామస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. మండలంలోని అంపురం, పద్మతుల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అంపురంలో 10, పద్మతులలో 3 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

నరసన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

బూర్జ : ఏ ఒక్కరికి మీ భూమిపై సమస్య ఉంటే తక్షణమే పరిష్కరిస్తామని తహశీల్దార్ వై.వి.పద్మావతి తెలిపారు. మండలంలోని కొరగాం, వైకుంఠపురం పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.రాజశేఖర్, సర్పంచ్ బి.సత్యం, మాజీ సర్పంచ్ ఎన్.సత్యం, మజ్జి వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

లావేరు : భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లోని రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సమస్యను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. మండలంలోని వేణుగోపాలపురం, నాగంపాళెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులు 72 వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రీసర్వే డిటి ఎన్.తిరుపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాపర్తి అప్పలరాజు, మండల సర్వేయర్ బల్లాడా శ్రీధర్‌రెడ్డి, విఆర్‌ఒ జగన్, గుమ్మడాం మాజీ సర్పంచ్ దుర్గాసి ధర్మారావు, కార్యదర్శి కెళ్ల రామకృష్ణ, ఎంపిటిసి జగ్గురోతు తవిటినాయుడు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఉండలేం

జి.సిగడాం: స్థానిక కెజిబివి నుంచి సోమవారం భార్గవి, లిఖితలు అనే ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన విషయం విదితమే. మంగళవారం తెల్లవారు ఏడు గంటలకు ఆమదాలవలస రైల్వేస్టేషన్ జిఆర్‌పి పోలీసులకు చిక్కారు. అక్కడి నుంచి శ్రీకాకుళం చైల్డ్ వెల్ఫేర్, ఉమెన్స్ ప్రొటెక్ట్ ఫోర్స్‌కు అప్పగించారు. ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి సాయంత్రం జి.సిగడాం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుసూదనరావు వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ దసరా సెలవులకు ఇంటికి వెళ్లేటప్పుడు మా తల్లిదండ్రులకు హాస్టల్లో ఉండడం ఇష్టం లేదని చెప్పామని, కానీ, తల్లిదండ్రులు ఈ ఒక్క సంవత్సరం చదవండి, వచ్చే ఏడాది మార్చేస్తామని చెప్పారని అన్నారు. కానీ, మేము వినిపించుకోకుండా సోమవారం తెల్లవారి రెండు నలభై నాలుగు నిమిషాలకు హాస్టల్ నుంచి వెళ్లిపోయామని అన్నారు. అక్కడి నుంచి రాజాం, రాజాం నుంచి విశాఖపట్నం వెళ్లామన్నారు. మళ్లీ అక్కడి నుంచి శ్రీకాకుళం వచ్చేశామని తెలిపారు. శ్రీకాకుళం వచ్చేసరికి రాత్రి 11 అయిందని, లిఖిత వాళ్ల ఇంటికి వెళ్లిపోదామని అనుకున్నామ అన్నారు. ఆ సమయంలో ఏ బస్సులు లేకపోవడంతో ఆమదాలవలస వెళ్లే బస్సు ఉండడంతో ఎక్కేశామని, అక్కడి నుంచి ఆమదాలవలస రైల్వే స్టేషన్‌కు వెళ్లామన్నారు. భార్గవి తల్లిదండ్రులు గుంటూరులో ఉండడంతో రైలు ఎక్కి అక్కడికి వెళ్లిపోదామని అనుకున్నామని చెప్పారు. ఆ సమయంలో రైలు లేకపోవడంతో ఉదయం గుంటూరుకు వెళ్లేందుకు టిక్కెట్ కూడా తీశామన్నారు. రైలు కోసం వేచి ఉండగా ఆర్‌పిఎఫ్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారని విద్యార్థినులు తెలిపారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగించారు.

విచారణ చేస్తున్న ఆర్‌జెడి శోభారాణి

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో వివిధ సెమినార్ల పేరిట అక్కడి ప్రిన్సిపాల్ పింకి సురేఖ రూ.లక్షల మేర అవినీతికి పాల్పడినట్టు ఇటీవల ఆరోపణలు వచ్చారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ రాజమండ్రి రీజనల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి కళాశాలలో మంగళవారం విచారణ చేపట్టారు. ముందుగా నాక్ ఏర్పాట్లపై సమీక్షించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం జరిగిన విచారణలో గడచిన కాలంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి సురేఖ వివిధ విభాగాల పరిధిలో నేషనల్ సెమినార్లను నిర్వహించారు. ఆ సమయంలో తప్పుడు బిల్లులు సమర్పించి అక్రమాలకు పాల్పడినట్టు కె.శ్రీనివాసరావు అనేక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులను సైతం ఆమె విచారించి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. విచారణ సమయంలో ప్రిన్సిపాల్ సురేఖ కూడా హాజరయ్యారు.

ఇద్దరు డిటిలకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూశాఖ పరిధిలో డెప్యూటీ తహశీల్దార్లుగా పనిచేస్తున్న ఇద్దరికి అడహాక్ ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సరుబుజ్జిలి తహశీల్దార్ కార్యాలయంలో డిటిగా పనిచేస్తున్న ఎం.చక్రవరికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ... కలెక్టరేట్‌లోని హెచ్-సెక్షన్‌కు బదిలీ చేశారు. అలాగే కొవ్వాడ అణువిద్యుత్కేంద్రం భూసేకరణ విభాగంలో డిటిగా ఉన్న జిఎల్ఇ శ్రీనివాసరావును కలెక్టరేట్‌లోని జి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు యోగేశ్వరి ఎంపిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

యోగేశ్వరి

రాష్ట్రస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు మండలంలోని డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.యోగేశ్వరి ఎంపికైంది. ఇటీవల ఆర్ట్స్ కళాశాల వేదికగా జిల్లా స్థాయి-19 పోటీల్లో హైజంప్ బాలికల విభాగంలో మొదటి స్థానం పొందింది. 1.35 సెంటి మీటర్లు దూకి ప్రతిభ కనబరిచింది. కర్నూలు జిల్లాలో డిఎస్ఎ స్టేడియంలో వేదికగా ఈ నెల 25,26 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనుంది. యోగేశ్వరికి ప్రధానోపాధ్యాయులు జె.సరోజిని, ఉపాధ్యాయులు అభినందించారు.

వాగ్వివాదానికి దిగిన డ్రైవర్లు

స్కూల్ బస్సును ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని వంశధార నదీతీరం చెవ్వాకులపేట ఇసుక రేవు నుంచి విసుకున్న తరలిస్తున్న ట్రాక్టర్ రామచంద్రాపురం గ్రామం వద్ద మంగళవారం శ్రీవాణి విద్యానికేతన్ బస్సును ఢీ కొట్టింది. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంతో రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు రామచంద్రాపురం గ్రామస్తులు చెబుతున్నారు. ప్రమాదం జరిగే సమయంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బస్సు ముందు బాగానే ఢీకొట్టాల్సిన ట్రాక్టర్ బస్సు వెనుక భాగాన ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులు కూడా తక్కువ మంది ఉండడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్ ట్రక్కు

ఇసుక ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని వంశధార నదీతీరం చెవ్వాకులపేట ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను తీసుకొస్తున్న ఓ ట్రాక్టర్ ట్రక్ మండలంలోని గాజులకొల్లివలస సమీపంలో రహదారిపై మంగళవారం బోల్తా పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ట్రాక్టర్ పైన కూలీలు కూడా ఎవరూ లేరు. ఇసుకను ట్రాక్టర్ పరిమితికి మించి లోడ్ చేస్తూ అతి వేగంతో రహదారిపై పరుగులు పెట్టిస్తుండడంతో ఈ క్షణాన ఏమి జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

నందిగాం : మండలంలోని కవిటి అగ్రహారం గ్రామ పరిధిలో గల బెండిగేట్ టెక్కలి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. కవిటి అగ్రహారానికి చెందిన బొమ్మాళి తిరుపతిరావు ద్విచక్ర వాహనంపై పూండి వెళ్తున్నాడు. బెండు గేటు వైపు వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.

విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకే

ఫీజుల వసూళ్లు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యాశాఖ కమిషనర్ సూచించిన ఆదేశాల మేరకే విద్యార్థుల నుంచి ఫీజులను వసూళ్లు చేస్తున్నామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. తన ఛాంబర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2022లో కమిషనర్ చేసిన ఆదేశాల మేరకే ఫీజులు వసూళ్ల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా విద్యార్థులకు అందే సొమ్ముని తమ మొబైల్‌లోని యాప్ ద్వారానే ఫీజులను చెల్లించుకునే సౌకర్యం విద్యార్థులకు అందిస్తున్నామని అన్నారు. అదనంగా ఫీజులు వసూళ్ల చేస్తున్నామనే అపోహలో విద్యార్థులు ఉన్నారని అన్నారు. ఎక్కడి నుంచో ఒక పేక్ ఉత్తర్వులను తీసుకొచ్చి వాటిని విద్యార్థులకు చూపించి వారిలో గందరగోళ పరిస్థితికి తీసుకువస్తున్నారని అన్నారు. ఇదే విషయమై ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని విద్యార్థుల సంఘ నాయకులు, విద్యార్థులు వివరించారని అన్నారు.

ఎన్నికైన ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు

ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

పొందూరు: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొందూరు, జి.సిగడాం మండలాల ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్రఫొటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మెట్ట నాగరాజు అధ్యక్షతన నూతన కార్యవర్గం సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడుగా జరజాపు వాసు, ఉపాధ్యక్షుడుగా పవన్, కోశాధికారిగా మహేష్‌బాబు, కార్యదర్శిగా ఆశెపు శివగోవింద, గౌరవాధ్యక్షులుగా అంగ సాంబశివరావులను ఎన్నుకు న్నారు. జిల్లా సంఘం సభ్యులు శంకర్, వేణు, శ్రీను, లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, సంతకవిటి మండలాల ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేవీకి శ్రీనిధి ఎంపిక

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శ్రీనిధి

మండలంలోని అనంతగిరికి చెందిన బందాపు శ్రీనిధి ఇండియన్ నేవీ ఉద్యోగానికి ఎంపికైంది. మంగళవారం విడుదలైన నేవీ తుది పరీక్షా ఫలితాల్లో ఉద్యోగానికి ఎంపికైంది. వచ్చే నెల 11న ఒడిశా రాష్ట్రంలోని చిలక నేవీ ట్రైనింగ్ సెంటర్‌కు హాజరు కాబోతుంది. తండ్రి బందాపు తేజేశ్వరరావు గొర్రెల కాపరి. ఈ సందర్భంగా శ్రీనిధిని పలువురు అభినందించారు.

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దువ్వాడ ఉదయ్ కిరణ్ ఇండియన్ ఆర్మీ (అగ్నివీర్)కు ఎంపియ్యారు. ఈ మేరు కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఉదయ్‌కిరణ్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి, ఫిజికల్ డైరెక్టర్ పి.మధు, ఎన్.శ్రీనివాస్ పట్నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థుల పడిగాపులు

గేటు బయట వేచి ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి- పొందూరు

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు నిర్వహించే ప్రత్యేక తరగతులకు రెండో రోజు సమయానికి పాఠశాల గేట్లు తెరవకపోవడంతో విద్యార్థులు మంగళవారం ఆరుబయటే వేచి ఉండాల్సి వచ్చింది. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటు సుమారు గంట సమయం తెరవకపోవడంతో విద్యార్థులు బయట ఎండలో పడిగాపులు కాయాల్సి వచ్చింది. సోమవారం నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కేటాయించారు. అయితే ఉదయం 8 గంటలకు తెరవాల్సిన పాఠశాల గేట్లు 8.45 వరకూ తెరవకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాల గేటుకు తాళం వేసి ఉండటంతో విద్యార్థులు ఆరుబయట రహదారిపై తిరుగుతున్నారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉండడంతో పాఠశాల గేటు తెరిచేంతవరకు స్థానిక పోలీసులు రక్షణగా కాపలా కాశారు. ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఎస్ఐ హరికృష్ణ

విద్యార్థులు మాదక ద్రవ్యాల బారినపడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ఒకటో పట్టణ ఎస్ఐలు హరికృష్ణ, కృష్ణారావు సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చైతన్య కళాశాల విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ, రిసెప్షన్, లాకప్ రూమ్ స్టేషన్ రైటర్, జీరో ఎఫ్ ఆర్, రికార్డుల నిర్వహణ, టెలికాన్ఫరెన్స్, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్, పార్టు మ్యాప్, పిస్టల్, ఆయుధాల గురించి వివరించారు. సిసి కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలు, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని ,మోటార్ వాహనాల చట్టాలు వివిధ రకాల బందోబస్తుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైతన్య జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ రౌతు శ్రీనివాసరావు, లెక్చరర్లు చినరాజు, నీలిమ, ఎఎస్ఐ రాంబాబు, రైటర్ బొమ్మాళి రవికుమార్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలను మంజూరు చేయాలి

టెక్కలి: టెక్కలిలోని కోర్టుకు నూతన భవనాలను మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద కోరారు. అమరావతిలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి బి.సి.జనార్ధన్‌ని మంగళవారం కలిసి వినతిపత్రం ఆందించారు. టెక్కలి కోర్టు భవనాలు నిర్మాణం పనులు ప్రాజెక్టు పూర్తయితే న్యాయ వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆధునిక సాంకేతికతో కూడిన కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈయనతో పాటు న్యాయవాదులు ఉన్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- సోంపేట


వినతిపత్రం అందజేస్తున్న గణపతి

మండలంలోని కొర్లాంలో అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు విశాఖలోని ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ వి.అప్పలనాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కొర్లంలో విశాఖపట్నం నుంచి ఇచ్ఛాపురం వైపు, ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వైపు వచ్చే అన్ని ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని విన్నవించారు. నిత్యం వందలాది మంది విశాఖపట్నం వైద్యం, ఇతర అవసరాల కోసం వస్తుంటారని తెలిపారు. దీనిపై రీజనల్ మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు రామ్ బుడ్డి గణపతి తెలిపారు.

117 జిఒను రద్దు చేయాలి

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్

రణస్థలం : ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను విద్యకు దూరం చేయడం ద్వారా ప్రభుత్వ విద్యకు నష్టం చేకూరుతుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ అన్నారు. మండలంలో పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణల వల్ల విద్యార్థులకు బోధనా సమయం నష్టం కలుగుతుందన్నారు. పాఠశాల సమయంలో బోధనకు ఆటంకం కలిగించే పలురకాల యాప్‌లు అప్‌లోడ్ చేయించడం సరికాదన్నారు. ఉపాధ్యాయులను బోధనకు తప్ప మిగిలిన అన్నిరకాల పనులకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 117 జిఒను రద్దు చేసి ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ప్రాథమిక పాఠశాలలుగా ఉంచాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మాధ్యమాలను ప్రవేశపెట్టాలని కోరారు. ఉన్నత పాఠశాలల నుంచి తీసుకున్న కంప్యూటర్లను ఆయా పాఠశాలలకు వెంటనే ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఎపిజెఎల్ఇ, సరెండర్ లీవ్ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి బి.రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.నారాయణ రావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రామారావు, ఎల్.కోదండరామయ్య, నాయకులు టి.శంకరరావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

120 రోజుల్లో చేసిందేమీ లేదు

ఎమ్మెల్సీ రామారావు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కంచిలి : కూటమి ప్రభుత్వం 120 రోజుల పరిపాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఇప్పిలి కృష్ణారావుతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్-6 అమలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 760 అత్యాచార ఘటనలు నమోదయ్యాయని అన్నారు. అసలు రాష్ట్రంలో పరిపాలన ఉందా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రైతు భరోసా, అమ్మకు వందనం ఏమయ్యాయని ప్రశ్నించారు. . ఇవన్నీ ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

మాట్లాడుతున్న జనార్ధనరావు

ఆముదాలవలస : మధ్యంతర భృతి 30 శాతం వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్ అసోసియేషన్ సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్తకోటవారివీధిలో ఉన్న ఎపిటిఎఫ్ జోనల్ కార్యాలయంలో పెన్షనర్ల సంఘ కార్యవర్గ సమావేశం సురవరపు సిమ్మి నాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ 70 ఏళ్లు నిండిన వారికి ఏడు నుంచి పది శాతానికి, ఆపై వారికి 12 నుంచి 15 శాతానికి, పూర్వ పద్ధతిలో ఐఆర్‌ను పెంచాలని కోరారు. పెన్షనర్ల సంఘ సభ్యులు దాస్యం లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, కె.కోటేశ్వరరావు, పి.భానోజీ రావు, బి.నారాయణరావు, బి.చిట్టయ్య, బలివాడ వెంకటరమణ, బి.వి.ఎస్.ఎన్.మూర్తి, పి.వెంకటేశ్వ రరావు, ఎన్. వాసుదేవరావు, ఎన్.సూర్యనారా యణ, బి.గోవిందరావు పాల్గొన్నారు.

పోరుకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- పొందూరు

దేశవ్యాప్తంగా తపాలా శాఖలో సుదీర్ఘకాలం పాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కార పోరాటానికి పోస్టుమెన్ అండ్ ఎంటిఎస్ ఉద్యోగులు సిద్ధం కావాలని జిల్లా ఎఐజిడిఎస్ యూనిట్ అసిస్టెంట్ సెక్రటరీ బెవర అప్పారావు పోస్టల్ కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎఐజిడిఎస్‌యు సంఘ పిలుపుమేరకు బుధవారం నుంచి 25 వరకు డిమాండ్లతో కూడిన నల్ల బ్యాడ్జీలను ధరించి, పోస్టుకార్డు ఈమెయిల్ క్యాంపియన్ నిర్వహించాలన్నారు. ఢిల్లీలోని డాక్ భవన ముందు నవంబరు 12, 13 తేదీల్లో హంగు ఫాస్ట్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నార న్నారు. అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కానీ లక్ష్యాలను వెంటనే ఆపాన్నారు. కమలేష్ చంద్ర కమిటీ రిపోర్ట్‌లో మిగులు ఉన్న అన్ని సానుకూల సిఫార్సులను తక్షణమే అమలు చేయాలనే డిమాండ్ల పరిష్కారానికి దశలవారీగా చేపడుతున్న పోరాటాల్లో భాగస్వాములు కావాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

లావేరు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ వెంకటరాజు ఆదేశించారు. మండలంలోని తామాడ, లక్ష్మీపురం పంచాయతీల్లో మంగళవారం పర్యటించారు. అనంతరం తామాడ సచివాలయంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. దానా తుపానుపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈయన వెంట కార్యదర్శి సుజాత ఉన్నారు.

టొయోటా రూమియన్ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కార్ల కొనుగోలుదారులకు పండగ సీజన్‌ను ప్రత్యేకంగా మలుస్తూ... టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం)ను నగరంలోని పెద్దపాడులో టొయోటా షో రూమ్‌ను రూమియన్ యొక్క ఫెస్టివ్ ఎడిషన్‌ను మంగళవారం ప్రారంభించారు. ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీ ప్యాకేజీలను కలిగి ఉన్న ఈ లిమిటెడ్-ఎడిషన్ సీజన్‌ను చక్కగా, ఆకర్షణీయమైన శైలిలో జరుపుకోవడానికి సరైన మొబిలిటీ ఎంపికగా నిలుస్తుందని టికెఎం ప్రాంతీయ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు. రూమియన్ పండగ ఎడిషన్, అన్ని గ్రేడ్‌ల్లో అందుబాటులో ఉందన్నారు. కస్టమర్లు ప్రీమియం అనుభవాన్ని ఆస్వాదిస్తున్నారని నిర్ధారిస్తూ... రూ.20,608 విలువైన డీలర్-ఫిట్టేడ్ టిజిఎ ప్యాకేజీతో వస్తుందన్నారు. టయోటా కిర్లోస్కర్ మోటార్స్ ఈ ప్రత్యేక ఎడిషన్‌ను ప్రీమియం యాక్సెసరీలు, అత్యుత్తమ విక్రయానంతర సేవలతో పాటుగా పొడిగించిన వారంటీలతో అందిస్తుందన్నారు. టొయోటా రూమియన్ ఇప్పటికే ఒక వైవిధ్యమైన, కుటుంబ-స్నేహపూర్వక ఎంపివి వలె చక్కటి ఫాలోయింగ్‌ను సంపాదించుకుందని అన్నారు. విశాలమైన ఇంటీరియర్స్, ఇంధన సామర్థ్యం, ఉన్నతమైన భద్రతా లక్షణాలను సజావుగా మిళితం చేసిందన్నారు. 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, స్మూత్ 6-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ మధ్య ఎంపికను అందిస్తూ... ఈ ఎంపివి నియో డ్రైవ్ (ఐఎస్ జి)తో శక్తివంతమైన కె.సిరీస్ 1.5-లీటర్ పెట్రోల్ ఇంజన్‌లో అందుబాటులో ఉందని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇటీవల బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో నివాసం ఉంటున్న బాలికలు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పలాసలో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. బాలికలతో రాజకీయాలు చేయవద్దని, బాలికలు కుటుంబానికి అండగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిరి ధానేష్, సభ్యులు తెప్పల ఢిల్లీరావు, పోతనపల్లి వైకుంఠరావు, మద్దిల పోలారావు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం జిల్లా అధ్యక్షులు సాలన వీరాస్వామి, జిల్లా కమిటీ సభ్యులు డి.లక్ష్మణరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పవన్ నాయకులు జస్వంత్, ప్రగతిశీల మహిళా సంఘం పిఒడబ్ల్యు ప్రధాన కార్యదర్శి కుసుమ, ఉత్తరాంధ్ర మహిళా సంఘం అధ్యక్షులు నాగమణి, ప్రగశీల మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు బర్ల జానకమ్మ పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంపూర్ణ ఆరోగ్యం నిత్య యోగ సాధన, ప్రకృతి వైద్యం ద్వారా సాధ్యమవుతుందని ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ చిలుకు లక్ష్మీకాంత్ అన్నారు. నగంరలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రకృతి వైద్యంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు ఆహారపు అలవాట్లు, వ్యసనాలతో కొత్త కొత్త వ్యాధులు పుట్టుకొస్తూ నిండు జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రకృతి వైద్యం ద్వారా అన్ని రకాల వ్యాధులు నయం చేసుకోవచ్చున్నారు. సదస్సులో వాకర్స్ ప్రతినిధులు ఇందిరాప్రసాద్, పి.జి.గుప్త, శాసపు జోగినాయుడు, బి.వి.రవిశంకర్, బి.దేవీప్రసాద్, జి.వాసుదేవరావు, సుగంధం సంజీవరావు, గుడ్ల జగ్గారావు, పొట్నూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబూరావు

అసత్య ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి- పలాస

అత్యాచారం జరిగిన ఆడపిల్లల విషయంలో రాజకీయాలు తగవని, పలాస ఎమ్మెల్యే శిరీషపై అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, హితవుపలికారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బాలికలపై అత్యాచారం జరిగిందని సమాచారం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే సిఐతో మాట్లాడి బాధితుల తల్లితో మాట్లాడారని అన్నారు. మాజీ మంత్రి అప్పలరాజు నిందితుడు శిరీషకు కలిశారని, రాజీ కోసం ప్రయత్నం చేశారని అబద్దాలు మాట్లాడడం సరికాదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో సెటిల్‌మెంట్లకు ఆస్కారం లేదన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు సూర్యనారాయణ, కృష్ణారావు, డొక్కరి శంకర్, టంకాల రవి శంకర్‌గుప్తా, బి.నాగరాజు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్, మల్లా శ్రీనివాసరావు, యవ్వరి మోహనరావు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న గడ్డెమ్మ

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

పలాస : దానా తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్థకశాఖ ఎడి పోతనపల్లి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను వల్ల భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ వసంతకుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, హౌసింగ్ ఎఇ రాజమోహన్, వెలుగు ఎపిఎం జాంబవతి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: బంగాళఖాతంలో ఏర్పడిన దాన తుపాను ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి గడ్డెమ్మ, ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్, తహశీల్దార్ ఆర్.అప్పలనాయుడులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. తుపాను సమయంలో పారిశుధ్యం పనులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయాలన్నారు.

చేప బెల్లం ద్రావణం తయారీ

రణస్థలం : మండలంలోని బంటుపల్లిలో చాప ఈశ్వరరావు ఏడు ఎకరాల విస్తీర్ణంలో వరి పంటకు గింజ నాణ్యత నిమిత్తం చేప బెల్లం ద్రావణం తయారు చేయించామని ప్రకృతి వ్యవసాయ మాస్టార్ ట్రైనర్ కంబపు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ద్రావణం తయారికి కావాల్సిన పదార్థాలు పది కిలోల చేపల వ్యర్థాలు, పది కిలోల బెల్లం తీసుకొని ఒక పాత్రలో చేపల వ్యర్థాలను పొరగా పరిచి దానిపైన బెల్లాన్ని పొరగా వేసి ఈ విధంగా పొరలు పొరలుగా వేసి 11 రోజులు పాటు ఉదయం, సాయంత్రం కర్రతో కలిపి మురగబెట్టిన అనంతరం ఈ ద్రావణం తయారవుతుందని పేర్కొన్నారు. యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు, మోడల్ మేకర్లు గంట్యాడ రాంబాబు, పట్నాల సత్యనారాయణ, రాజేశ్వరి, సూర్యకాంతం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో చీడపీడల నివారణ

మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న ఎడి మధుబాబు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని పలాస వ్యవయశాఖ ఎడి మధుబాబు సూచించారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం, జోడూరు గ్రామాల్లో ఎఒ దానకర్ణుడు అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించి సుడిదోమ, పాము పొడ తెగులు, కంకి నల్లి ఆశించి ఉన్నాయని తెలియజేశారు. రైతులు విధిగా యాజమాన్య పద్ధతులు చేపట్టాలని తెలిపారు. సుడిదోమ వరి మొదల వద్ద ఆశించి రసం పీల్చడంతో సుడులు సుడిలుగా ఎండిపోతుందన్నారు. దీనివల్ల పంటలు దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాణా ఈశ్వరమ్మ, టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, టిడిపి మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ, సర్పంచ్ బెజ్జపల్లి జయమ్మ పాల్గొన్నారు.

సుడిదోమపై అప్రమత్తం

నందిగాం : సుడిదోమపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ సూచించారు. మండలంలోని లఖిదాసుపురంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు సస్యరక్షణతో పాటు చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రగడ వాసవి, రైతులు పి.ఉమాపతి, ఎం.లోకనాథం పాల్గొన్నారు.

సోంపేట : గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ నరసింహమూర్తి కోరారు. మండలంలోని గోల్లూరు, రాజాంల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

కవిటి: పొట్ట దశలో పంటను ఆశించే తెగుళ్లపై రైతుల అప్రమత్తంగా ఉండాలని మండల ఎఒ బడగల దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని బెలగాంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.ఈశ్వరరావు, మణిచంద్ర ప్రకాష్, రంగా రౌలో, వాసుదేవ్, నేతాజీ, మోహనరావు, వ్యవసాయ సహాయకుడు పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : సమగ్ర యాజమాన్యంతోనే పంట దిగుబడి సాధించవచ్చునని మండల ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని తోటాడలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అక్కివరం, తోటాడ నాయకులు తాండ్ర హరి, బెండి రామ్మోహన్, బి.సీతారాం, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సుధీర్ పాల్గొన్నారు.

నందిగాం : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీకాంత్‌వర్మ

సరుబుజ్జిలి : సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే అధిక పంట దిగుబడి సాధించ వచ్చునని మండల ఎఒ బొడ్డేపల్లి పద్మనాభం అన్నారు. మండలంలోని చిగురువలస గ్రామ సచివాలయ పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల యాజమాన్య పద్ధతులు ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఇఒ రాము, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ బెనర్జీ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎమ్మెల్యే పరామర్శ

పోలాకి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నక్క రామారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈయన వెంట టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, గొల్లంగి వెంకటరావు, యాళ్ల అసిరినాయుడు, నేతింటి రామ్మూర్తి పాల్గొన్నారు.

మందులను పంపిణీ చేస్తున్న కరుణాకరరావు

నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి పాతపట్నం

గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తుందని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో పెదలోగిడిలో నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఇప్పటి వరకు 16,350, మెళియాపుట్టి మండలంలో 23,800 పశువులకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేశామన్నారు. గొర్రెలు, మేకలు మృతుల శాతం తగ్గించడానికి, శరీర బరువు పెంచుకోవడానికి ఈ నట్టల నివారణ మందులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో దువ్వారి ఉదయ భాస్కరరావు, పెదలోగిడి పశువైద్యాధికారిని డాక్టర్ కె.మౌనిక, నిరంజన్, ఉత్తమరావు, మోహన్, శంకర్ పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న యువత, ప్రజాప్రతినిధులు

దీక్షకు సంఘీభావం

ప్రజాశక్తి- కవిటి

తమ సమస్యల పరిష్కారానికి 300 రోజులుగా కవిటి బస్టాండ్‌లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న బెంతు ఒరియాలకు మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, కళాకారులు సంఘీభావం తెలిపారు. 301వ రోజు దీక్షలో భాగంగా మంగళవారం బొరివంకకు చెందిన యువత దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్, ఎఫ్‌పిఒ అధ్యక్షుడు, బొరివంక వార్డు మెంబర్ బల్లెడ జయప్రకాష్, విశ్రాంత ఉపాధ్యాయుడు, నంది అవార్డు గ్రహీత బల్లెడ మోహనరావు, మృదంగం విద్వాంసుడు లోల్ల కృష్ణారావు తదితరులు దీక్షలో పాల్గొని బెంతు ఒరియాలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బెంతు ఒరియాలు మాట్లాడుతూ రోజురోజుకు తమ సమస్యను ప్రజలు గుర్తిస్తున్నారని, మరికొద్ది రోజుల్లో ప్రభుత్వాలూ గుర్తించి తమకు న్యాయం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పరిశీలన, పరిశోధనలతోనే అభివృద్ధి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు అభివృద్ధి సాధించడానికి పరిశోధన, పరిశీలన, కృషి ఎంతో అవసరమని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కింతలి సూర్యచంద్రరావు పేర్కొన్నారు. కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల పరిధిలో మొత్తం 18 విభాగాలకు యూనివర్సిటీ ప్రతినిధులు, ఆయా అటానమస్ డిగ్రీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి తరగతుల వారీగా ఈ సమావేశానికి హాజరయ్యారు. విభాగాల వారీగా మేజర్, మైనర్ కోర్సుల పాఠ్యప్రణాళికలు, మోడల్ పేపర్స్, యాడ్ ఆన్ కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులు, షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ సర్టిఫికెట్ కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, లైఫ్ స్కిల్స్ కోర్సులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు,

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

డిపార్ట్‌మెంటల్ యాక్టివిటీ ప్లాన్స్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సిఒఇ) టి.ఆదిలక్ష్మి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.ఎస్.కనకదుర్గ, వై.ప్రశాంతి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రారంభిస్తున్న సిఐ ఉమామహేశ్వరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శాస్త్ర, సాంకేతిక, చరిత్ర, సాహిత్య పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం పెంచుకోవచ్చని శ్రీకాకుళం టూ టౌన్ సిఐ జి.ఉమామహేశ్వరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్ వద్ద విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎన్నో పుస్తకాలను తక్కువ ధరకే అందుబాటులో ఉంచి విశాలాంధ్ర పుస్తకాలయాలు ప్రజలకు చేరువవుతున్నాయన్నారు. ఇంటర్నెట్‌కు అలవాటు పడిన యువత పుస్తకాలు చదివేందుకు మక్కువ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు చదివితే జ్ఞానం, విజ్ఞానం, మనసు ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ పుస్తకాలను నేస్తంగా భావిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విశాలాంధ్ర బుక్ షాప్ మేనేజర్ రవికుమార్, బుక్‌హౌస్ వ్యాన్ ఇన్‌ఛార్జి నజీర్ పాల్గొన్నారు.

'కెపి స్పందన' సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని సూరాడవానిపేటకు చెందిన కొర్లమ్మ, సంతబొమ్మాళికి చెందిన గోపి కుటుంబాలకు కెపి స్పందన ఫౌండేషన్ మంగళవారం నెలకు సరిపడా రూ.2,500 విలువ చేసే 25 కిలోల బియ్యం, 35 రకాల నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ మొత్తం నర్సిపురం రామారావు కుమారుడు కార్తీక్, యర్నాగుల సూర్య ప్రకాష్ కుమారుడు వర్షిత్ పుట్టిన రోజు కానుకలుగా అందజేశారు. జన్మదిన వేడుకల పేరుతో అనవసర వృథా ఖర్చులు చేయకుండా బాధిత కుటుంబాలకు ఆకలి బాధతీర్చడంలో పలువురికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారని ఫౌండర్ షణ్ముఖరావు, సర్పంచ్ భూషణరెడ్డి, శివారెడ్డి, సుందర్, సూర్యప్రకాష్, రామారావు అభినందనలు తెలియాజేశారు.

సరుకులను పంపిణీ చేస్తున్న సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

కోటబొమ్మాళి : మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పొందూరు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని తాడివలస జెడ్‌పి హెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య అన్నారు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థిని బొంగు నవ్యశ్రీ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల ఆవరణంలో మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలో సమతుల్యతకు మొక్కలు అవసరమని, పాఠశాలలో విద్యార్థుల పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే సంప్రదాయం చాలా ఆదర్శవంతమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యావరణ మిత్ర ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణం పరిరక్షించిన వారు అవుతారని కొత్తపల్లి మాజీ సర్పంచ్ శిమ్మ సింహాచలం అన్నారు. ఈ మేరకు ఎస్‌విఎం పాఠశాల ఆవరణలో తెంబూరు సత్యసాయి వారి సౌజన్యంతో మంగళవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నౌపడ రామారావు, డైరెక్టర్ దుబ్బ శివాజీనాయుడు, సలహాదారుడు నౌపడ సింహాచలం, ప్రధానోపాధ్యాయులు కర్రి రామగోపాలరావు, మౌళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

రెండోసారి ఎమ్మెల్సీగా బలపర్చాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను రెండో సారి గెలిపించేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ పి.రఘువర్మ ఉపాధ్యాయులను అభ్యర్థించారు. మండలంలోని హుకుంపేట, అమలపాడు, పెద్దమురహరిపురం, దేవునల్తాడ, గోవిందపురం, పాతటెక్కలి పాఠశాలల్లో ఉపాధ్యాయులను మంగళవారం కలిసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పిఆర్‌సి కమిషన్ వేయాలని, డిఎ బకాయిలను చెల్లించాలని, 117 జిఒను రద్దు చేసి పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు వెంకటరావు, ఆనందబెహరా, పి.కిషోర్, మెట్ట మోహనరావు, ఎన్.షన్ముఖరావు, బి.హేమశంకర్, టి.లింగరాజు పాల్గొన్నారు.

నగదును అందజేస్తున్న కాళేశ్వరరావు

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని బేసిరామచంద్రపురం ఉన్నత పాఠశాలలోని పలువురు విద్యార్థులకు చిచ్చుల కాళేశ్వరరావు మంగళవారం ప్రోత్సాహకాలను అందజేశారు. తన తండ్రి మాజీ సర్పంచ్ చిచ్చుల రఘునాథ్ జ్ఞాపకార్థం ప్రత్యేక విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి విద్యార్థుల్లో మంచి ప్రతి చూపిన విద్యార్థులతోపాటు ట్రిబుల్ ఐటికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు ఏటా రూ.5 వేలు చొప్పున స్కాలర్‌సిప్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని శాసనపురి శైలజకు రూ.3 వేలు నగదు ప్రోత్సాహకాన్ని సైతం అందించారు. కార్యక్రమంలో బుద్ధాన శ్రీకృష్ణ, వి.సతీష్, ఎస్.వెంకటరావు, జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

డయేరియాపై అప్రమత్తం

పొందూరు: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రమేష్ నాయుడు, నవీన్ నాగపవన్ కళ్యాణం లు పేర్కొన్నారు. పట్టణంలో తాడివలస పిహెచ్‌సి వైద్య సిబ్బంది మంగళవారం వీధివీధికి తిరిగి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. పక్క జిల్లా విజయనగరంలో డయేరియా వ్యాధి విజృంభిస్తుండడంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ముందస్తు జాగ్రత్తపై దృష్టిసారించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజూ కనీసం ఇద్దరు, ముగ్గురు రోగులు డయేరియా వ్యాధితో చికిత్సకోసం చేరుతుండడంతో తాడివలస వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి రోగుల వివరాలు సేకరించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే పట్టణంలో పారిశుధ్యం రోజూ నిర్వహించేలా చూడాలని సచివాలయ అధికారులను కోరారు.

మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

చదువుపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని ఆదర్శ పాఠశాల, కెజిబివిలో పొందూరు సెషన్స్ జడ్జి జ్యోత్స్న మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చదువు, విజ్ఞానం పెంచుకోవడంతో పాటు బాల్యవివాహాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బాలికలకు సమాజంలో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎదుర్కొనే విధానంపై అవగాహన కల్పించారు. కెజిబివిలో సోమవారం జరిగిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమైన సంఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని వసత గదులను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.ప్రసాద్, ఈశ్వరరావు, రాము అశోక్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లంక అన్నా శామ్యూల్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- సోంపేట

పట్టణానికి చెందిన న్యాయవాది ఒడిస బాలకృష్ణ సోదరి చీర శాంతమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైసిపి నాయకులతో కలిసి బాలకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి డాక్టర్ దాసు, నాయకులు పాల్గొన్నారు.